

## అనగనగా... ఒక కథ

# అంత్యేష్టి

సర్వేశ్వర శర్మగారు తాతలనాటినుంచీ ఉన్న అర ఎకరం పొలం కూడా అమ్మేసి, భార్యకి వచ్చిన కేన్సరుకి చికిత్స చేయించాల్సి వచ్చింది. గృహలక్ష్మి జారిపోయిందిగానీ, ఆరోగ్యలక్ష్మి ఆశీస్సు లభించలేదు.

ఆవిడ ఆపరేషను వికటించింది-

50 ఏళ్ల దాంపత్య జీవనం వాడి వీడిపోయింది. వైద్యం కోసం ఆయన ఆ అర ఎకరం అమ్ముతున్నప్పుడు కొనుక్కున్న షావుకారు రామక్రిష్ణారావుకి సర్వేశ్వరశర్మ గారి మీద చాలా జాలేసింది.

నిజం చెప్పాలంటే సర్వేశ్వరశర్మగారి చెక్క తన చేలో కలుస్తుంది. రామక్రిష్ణారావు తండ్రి ఉన్ననాళ్లూ సర్వేశ్వరశర్మ చేత ఆ పొలం అమ్మించి...తన పొలంలో అది కలిపేసుకోవాలని చాలా ప్రయత్నం చేసేవాడు.

సర్వేశ్వరశర్మగారు ఆ ఆధరవుకూడా లేకపోతే బతకలేననో తాతలనాటి ఆస్తిని అమ్మడం ఇష్టంలేకనో మొండిగా వుండేవాడు.

భార్యకి చేసిన జబ్బు సెంటిమెంట్‌ని వదులుకోమంది.

తాతల్నాటి పొలాన్ని అమ్ముతున్నప్పుడు సర్వేశ్వరశర్మ గుండెల్లో సుళ్లు తిరిగిన దుఃఖం కళ్లలోంచి పొంగి పడదామని చేస్తున్న ప్రయత్నం రామక్రిష్ణారావు గమనించారు.

అతనికి అవసరానికి డబ్బిచ్చాడు. డబ్బు తీసుకోవడానికి అతడు పెట్టిన ఆంక్షకి అనుకూలంగా దస్తావేజు కూడా రాయించాడు. రిజిస్ట్రేషన్ కూడా చేయించాడు.

ఈ ప్రతీ ప్రొసీజర్‌కి రామకృష్ణారావు ఎన్నిసార్లు సిగ్గుపడ్డాడో, బాధపడ్డాడో...

సర్వేశ్వరశర్మ లక్ష్యం ఒక్కటే... భార్య ఆరోగ్యం బాగుపడాలి.

అనుకున్నట్టు బాగుపడలేదు.

సర్వేశ్వర శర్మ బాధ కన్నా, రామక్రిష్ణారావు బాధ ఎక్కువైంది. 'తన డబ్బు మంచిది కాదేమో? ఆయన కోరుకున్న కారణాన్ని సంపూర్తి చేయలేదు' అనుకునేవాడు.

అందుకే ఆవాల్టి నుండి సర్వేశ్వరశర్మ మీద చాలా జాలి చూపించేవాడు.

అది జాలి అనలేం. భక్తి అనలేం? మరి ఏం అనాలో...

* * *

సర్వేశ్వరశర్మ ఇల్లాలు పోయినప్పట్నుండీ అతన్ని దుఃఖం నుంచి ఓదార్చడానికి తండ్రై, కొడుకై అన్నై ఆదరిస్తున్నాడు రామకృష్ణారావు.

అంతకుమించి అతని ఆకలి వేళకి కావలసిన ఆధరువులు ఏర్పాటు చేస్తున్నాడు.

సర్వేశ్వర శర్మకి ఎంత మొహమాటంగా ఉన్నా కృతజ్ఞత చెప్పే ధ్యాస లేదు.

అర్ధాంగి పోగానే సగం శరీరానికి పక్షవాతం వచ్చినట్లయింది.

అన్నిటిలో నిరాసక్తత..నిర్లిప్తత ఇలాంటి పరిస్థితిలో కనిపెట్టుకు చూసే కావాల్సిన వాళ్లు ఎవ్వరూ లేరు. ఉన్నా చూసినందుకు వాళ్ళక్కావాల్సింది ఇతని దగ్గరేం లేదు కనుక ఎవ్వరూ దగ్గరకు రారు.

నలభై గజాల నట్రాట గుడిసెలో ధన హీనమైన, దైన్యమైన అతన్ని పలకరించినా ప్రయోజనమేం లేదు.

ఏమీ లేకపోవడం వల్ల ఆయనకెవ్వరూ లేకపోయారు.

రామకృష్ణారావు ఒక్కడే అతని ఆస్తి-ఆపద్బంధువు, ఆప్తమిత్రుడు.

ఒకరోజు విచారంతో..దుఃఖంతో అనారోగ్యం కమ్ముకున్నప్పుడు జాలిగొలిపేలా, బేలగా...

"నేన్నిన్నేమీ అడక్కూడదు. నువ్వు నాకు దయతలచి బిక్షవేస్తున్నావు"

"శర్మగారూ..దయచేసి మీరలా అనకండి. మీ బలవంతం వల్ల, మీ పొలాన్ని మీరు అమ్మారు, నేను కొనుక్కున్నానేమోగానీ...అది నాది కాదు అని నేను మనస్ఫూర్తిగా అనుకుంటున్నాను. కనీసం నేనున్నన్నాళ్ళయినా ఈ సహాయం చెయ్యనివ్వండి"

"కృష్ణారావు...నువ్వలా మాట్లాడకూడదు. నీలాంటి మంచివాడు నిండు నూరేళ్ళు ఉండాలి. నాలాంటి యాచకుడు ముందుగా వెళ్ళాలి"

"శర్మగారూ...మీరు యాచకులు కాదు. యజమాని. నేను వేస్తున్నది బిక్ష కాదు. ఇస్తున్నది శిస్తు. నాకు కౌలుకిచ్చాను అనుకోండి. మీ పంటను మీకో కొంత అందించడం నా ఔదార్యం కాదు."

"నేను నీ మంచితనాన్ని కాదన లేని స్థితిలో ఉన్న అసమర్ధుణ్ణి. నువ్వు ఈ అభిమానాన్ని చూపించకపోయినా నోరెత్తలేని అప్రయోజకుణ్ణి. కానీ అడగని సాయం చేస్తున్న నీకు అడిగి ఓ సాయం చేయించుకోవాలనుంది. ఇది మళ్ళీ ఋణం కాదు. ఋణం తీరిపోయే చివరి సేవ అనుకో"

"మీరు కోరిక కోరడమే అరుదు, కాదన్ను...చెప్పండి"

* * *

"ఏంటో..ఆ ముసలాయనకి రోజూ దేవుడికిచ్చినట్టు స్వయంపాకాలివ్వడం...ఏం పుణ్యం పావుకుందామనో"

"పుణ్యం బావుకోడానికి కాదు. పాపం తేముకోవడానికి.."

"మీరేమంత పాపం చేసారట?"

"చేసాను. ఆ పాపం నీకూ మన పిల్లలకి అంట కూడదని తాపత్రయ పడుతు

**"మీరు నిండు నూరేళ్లు బ్రతకాలి అని నేను అనుకునేవాణ్ణి. మీరు బుధవారం స్వర్గప్రయాణానికి ముహూర్తం పెట్టేసుకున్నారు. నాకీ మాట వినడానికే మనస్కరించకపోయినా.. మనస్ఫూర్తిగా మీ మాటని పాటించడానికి అంగీకరిస్తున్నాను."**

న్నాను...అది నీకు చెప్పినా అర్థం కాదు''

భార్యతో రోజూ జరిగే పోరాటాన్ని చాలా సహనంగా భరించడం రామకృష్ణారావుకు అలవాటయింది.

ఇప్పుడు సర్వేశ్వర శర్మగారు చివరి కోరికంటూ ఉంటే...

★ ★ ★

''చెప్పండి శర్మగారూ..మొహమాటమొద్దు..నేను మీ తమ్ముని లాంటి వాణ్ణి''

''నేను బుధవారం చనిపోతాను. మూడ్రోజుల టైం ఉంది. నా అంత్యక్రియలు నా బంధువులనెవ్వరిని పిలవకుండా నువ్వే చెయ్యాలి''


''శర్మగారూ..'' నిర్ఘాంతపోతూ, గద్గదంగా ఆగాడు రామకృష్ణారావు.

సర్వేశ్వర శర్మగారు నిశ్చయమైన మౌనంతో అతని కళ్లలోకే చూస్తున్నాడు.

''నేను...బ్రాహ్మణున్ని కాదు. మీరు కోరిన కోరిక..''

''అనాథ ప్రేత సంస్కారం పుణ్యం కలిగిస్తుంది. కాదనకు. అన్నదానం చేస్తున్నావు. అంత్యేష్టి పుణ్యం కూడా నువ్వే దక్కించుకో''

''మీరు నిండు నూరేళ్లు బ్రతకాలి అని నేను అనుకునేవాణ్ణి. మీరు బుధవారం స్వర్గప్రయాణానికి ముహూర్తం పెట్టేసుకున్నారు. నాకీ మాట వినడానికే మనస్కరించకపోయినా..మనస్ఫూర్తిగా మీ మాటని పాటించడానికి అంగీకరిస్తున్నాను.''




★ ★ ★

రామకృష్ణారావు మనస్సులాగే ఆకాశం ముసురేసింది.

అతని కళ్ళల్లో పొంగాల్సిన నీరు ఆ మంగళవారం నుంచీ మేఘాలు కురిపిస్తున్నాయి. బుధవారం కూడా తెరిపిన పడలేదు. గొడుగేసుకుని బియ్యం, పప్పు గట్రా (స్వయంపాకం) పట్టుకుని శర్మగారింటికి బయల్దేరాడు కృష్ణారావు.

ఆయన జ్యోతిషంమ్మీద నమ్మకమైతే ఉందిగానీ, ఆయన మరణిస్తానని చెప్పిన మాటని జీర్ణించుకోవడం కష్టంగా వుంది.

ఆయనకేం అవకూడదు అనుకునే ఇలా స్వయంపాకంతో బయల్దేరాడు.

ఆయన జోస్యం నిజమైంది.

తనకోసమేనా అన్నట్టు- తలుపు బార్లా తెరిచి ఆయన ప్రాణం గాలిలో కలిసిపోయింది.

రామకృష్ణారావు తడిసిన బట్టల్లో, అతని కన్నీళ్లు కలిసిపోయాయి.

అంత్యక్రియలు చేస్తావుగా- సర్వేశ్వరశర్మగారు ఆశగా చూస్తున్నట్టు కళ్లు తెరుచుకునే గతించారు.

కనురెప్పలు చేతుల్తో మూసి, ఈ వర్షంలో ఏం చెయ్యడమా? అన్న ఆలోచనల్లోంచి ఆయనకి ఒక ఉపాయం స్ఫురించింది.

★ ★ ★

సర్వేశ్వరశర్మగారి ఇల్లు తగలబడిపోయింది.

నిట్రాట నుంచి మంటలు పైకెగసి పొడిగా వున్న కప్పు మేరా అంటుకుని కుప్పకూలి ఆయన దహనమైపోయాడు.

బయట నిలబడిన రామకృష్ణారావు శర్మగారికి కపాలమోక్షం జరిగే దాకా వర్షస్నానం చేసాడు.

★ ★ ★

ఆ స్థలంలో సర్వేశ్వర శర్మ జ్ఞాపకార్థం ఒక వృద్ధాశ్రమం నిర్మించాడు రామకృష్ణారావు.-అర ఎకరం పొలానికి తోడుగా దాని ప్రక్కనున్న తన రెండెకరాల్ని శాశ్వత విరాళంగా పట్టారాసి.

*